శ్రీనివాస్‌పై ఎంపీపీ ధ్వజం

అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : ప్రొటోకాల్ లేకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన కంది శ్రీనివాస్ అధికార దుర్వినియోగానికి పాల్పడడం అమానుషమని జైనథ్ ఎంపీపీ మార్కెట్టి గోవర్ధన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి ఫిర్యాదు చేశారు. ఇటీవల మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేత శ్రీనివాస్ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారన్నారు. ఆయనకు పదవి లేకుండానే పనులు ప్రారంభించడం, కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రొటోకాల్ లేని వ్యక్తికి అధికారిక కార్యక్రమాల్లో పదేపదే పాల్గొంటూ రావడంపై ఆరా తీయాలని కోరారు. ఈ విషయమై అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల నాయకులు సర్సన్ లింగారెడ్డి, ఎంపీటీసీ భోజన్న, నాయకులు రమేశ్, కేశవ్, శివప్రసాద్, సతీశ్ పాల్గొన్నారు.

వివరాలు అందుబాటులో ఉంచాలి

వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

భీంపూర్, ఫిబ్రవరి 15 : భీంపూర్ మండలంలోని 26 పంచాయతీలు, అనుబంధ గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి కోసం తమ వివరాలు అందుబాటులో ఉంచాలని ఆ శాఖ ఏఈ కొమ్మావార్ శ్రావణ్‌కుమార్, రీడర్ అనిల్ తెలిపారు. భీంపూర్, కరంజి(టీ), తదితర గ్రామాల్లో గురువారం అవగాహన కల్పించారు. వినియోగదారులు ఇంటి వద్ద లేకున్నా మీటరు వద్ద ఆధార్, తెల్ల రేషన్ కార్డు, ప్రజాపాలనలో అందించిన దరఖాస్తు రసీదు జిరాక్స్ కాపీలను, మొబైల్ నంబర్ ఉంచాలని తెలిపారు. సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

ఉట్నూర్, పిబ్రవరి 15 : ఈనెల 17లోగా 'గృహ జ్యోతి' కోసం ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాలని ఉట్నూర్ ఏఈ శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఆన్‌లైన్ చేస్తున్నారని పేర్కొన్నారు. అందుబాటులో లేని వారు కార్యాలయానికి వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఒకరి ఆత్మహత్య

గుడిహత్నూర్, ఫిబ్రవరి 15 : మన్నూర్ గ్రామానికి చెందిన వాగ్మారే సూర్యకాంత్ (33) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న సూర్యకాంత్ దవాఖానకు వెళ్లినా తగ్గలేదు. బుధవారం రాత్రి నొప్పి ఎక్కువకావడంతో మందుల కోసం మెడికల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. గ్రామ సమీపంలోని శివశక్తి కంకర మిషన్ వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. సూర్యకాంత్ భార్య వాగ్మారే కిరణ్‌తాయి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎదులాపురం : వేడుకల్లో పాల్గొన్న బంజారా సంఘం నాయకులు

బోథ్ : కైలాస్ టేకిడిలో పూజలు చేస్తున్న లింబాజీ మహరాజ్

జైనథ్(బేల) : సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేస్తున్న నాయకులు

నార్నూర్ : పూజలు చేస్తున్న సేవాలాల్ ఉత్సవ సమితి సభ్యులు

ఘనంగా సేవాలాల్ జయంతి

జిల్లాలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజారాల ఆధ్వర్యంలో సేవాలాల్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. బోగ్ బండార్ నిర్వహించి, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మహిళలు, యువతులు, యువకులు ర్యాలీలు తీశారు. సేవాలాల్ జెండా ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో అధికారికంగా నిర్వహించే శ్రీ సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమానికి బంజారాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జీవితంలో సామాజిక, ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకుంటే ప్రశాంతమైన జీవితాన్ని గడుపవచ్చని పేర్కొన్నారు.

గుడిహత్నూర్‌లో ఎమ్మెల్యే..

గుడిహత్నూర్, ఫిబ్రవరి 15 : గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న రాథోడ్ తుకారాం భార్యను, రాథోడ్ బిక్కు కూతురిని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు గోండ్ భీంరావ్, జీ తిరుమల్‌గౌడ్, కుమ్రం శంభు, నాయకులు గిత్తె గజానంద్, తగరే ప్రకాశ్, తెలంగె మాధవ్, గోవింద్, తుకా రాం, సంగ ఆశన్న యాదవ్, శివాజీ, దోమకొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీ నుంచి రైతు వేదిక వరకు ఉత్సవ ర్యాలీ తీశారు. మహిళలు, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం మహా బోగ్ బండారా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆడె శీల, సర్పంచులు జాదవ్ సునీత, పవార్ రవీందర్, పశు సంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ రాథోడ్ రామారావ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండె, బంజారా నాయకులు జాదవ్ రమేశ్, సునీల్, ఉపాధ్యాయులు పూల్‌సింగ్, బిక్కు, గోవింద్, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : జిల్లా కేంద్రంలోని సంఘ భవన స్థలంలో బంజారాలు సంత్ సేవాలాల్ జయంతి ఘనంగా జరుపుకున్నారు. సంత్‌సేవాలాల్, దుర్గాదేవి చిత్రపటాలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేశ్ నాయక్ మాట్లాడారు. 20న రాంలీలా మైదానంలో అధికారికంగా నిర్వహించే జయంతి కార్యక్రమానికి బంజారాలు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా మంత్రి సితక్క, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌష్ ఆలం, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్‌నాయక్, కులపెద్దలు బలరాంనాయక్, గోపాల్‌జాదవ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

గుడిహత్నూర్ : వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కైలాస్ టేకిడిలో పూజలు ..

బోథ్, ఫిబ్రవరి 15 : నిగిని అటవీ ప్రాంతంలోని కైలాస్ టేకిడిలో కొలువైన మహాదేవుడి ఆలయ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సంత్ లింబాజీ మహరాజ్ బోగ్ బండారా పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరేందర్, బద్రూ తదితరులు పాల్గొన్నారు. బోథ్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మాట్లాడారు. శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడువాలని బంజారాలకు సూచించారు. ప్రధాన రహదారిలోని రామారావ్ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్‌లో..

నార్నూర్, ఫిబ్రవరి 15 : నార్నూర్, గాదిగూడ మండలాల్లోని బంజారా తండాల్లో జగదంబా దేవీ, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్‌కు సంప్రదాయ పూజలు చేశారు. బోగ్ బండారా నిర్వహించారు. సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, దిగంగర్, శివాజీపటేల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో..

ఉట్నూర్, ఫిబ్రవరి 15 : పట్టణంలోని పలు వీధుల గుండా భారీ ర్యాలీ తీశారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌక్‌లోని సేవాలాల్ జెండా గద్దెల వద్ద బోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా పాల్గొని, సేవాలాల్‌పై తీసిన పాట సీడీ ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, నాయకులు నరేశ్ జాదవ్, గుగ్లావత్ శ్రీరాం, జగన్, వివిధ సంఘాల ఉపాధ్యాయులు, బంజారా సంఘాల నాయకులు, జీఆర్‌పీ ప్రొడక్షన్ సభ్యులు పవార్ రవీందర్, గాయకుడు మోహన్ నాయక్, పవార్ దినేశ్, వసంత్, చంద్రకాంత్, బంజారా నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 15 : పులిమడుగులోని సేవాలాల్ మందిరంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘ నాయకుడు బాబాశ్యాం, గ్రామస్తులు దినేశ్ నాయక్, సురేశ్ పటేల్, యశ్వంత్ రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర..

జైనథ్(బేల), ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలో సభా స్థలం నుంచి ర్యాలీగా సేవాలాల్ విగ్రహ ఏర్పాటు స్థలం వరకు శోభాయాత్ర నిర్వహించారు. యువతులు తలపై కళశాలతో, మహిళలు బంజారా వేషాధారణలతో ఆకట్టుకున్నారు. సభ స్థలంలో బోగ్ భండార్ నిర్వహించి, ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు గణపత్ రాథోడ్, ఉపాధ్యక్షుడు పవార్ కైలాశ్, శ్యాంరావ్ నాయక్, లింబాజీ నాయక్, సీతారాం నాయక్, రోహిదాస్, జాదవ్ ప్రభాబ్, దేవిదాస్ నాయక్, గోపిచంద్ నాయక్, గంభీర్ ఠాత్రే, సతీశ్ పవార్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : ర్యాలీలో పాల్గొన్న బంజారాలు

ఉట్నూర్ రూరల్ : పూజలు చేస్తున్న గ్రామస్తులు

రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రోడ్డు నిర్మించాలి

- బీర్సాయిపేట్‌వాసుల ధర్నా

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 15 : మండలంలోని దంతన్‌పెల్లి నుంచి బీర్సాయిపేట్ వరకు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీర్సాయిపేట్‌లో ప్రధాన రహదారిపై గురువారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఐదేండ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. నాయకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిత్యం వందలాది మంది వాహనాల రాకపోకలు సాగిస్తారని, బ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత వానకాలంలో వర్షాలకు వంతెన వద్ద రోడ్డు పాడైపోయినా అధికారులు, నాయకులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గత్యంతరం లేక ధర్నా చేయాల్సి వస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్ ఎంపీడీవోకు సన్మానం

బోథ్, ఫిబ్రవరి 15 : బోథ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎల్ రమేశ్‌ను గురువారం పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. మండలాభివృద్ధికి కలిసి పని చేద్దామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేశ్వర్, ప్రభులింగం, డీ ప్రమీల, శశికాంత్, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, ప్రసాద్‌గౌడ్, నరేశ్‌చారి, స్వామి, మిథున్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అనీశ్‌కుమార్, అరుణ్‌రెడ్డి, ఈర్ల శ్రీకాంత్, మద్దెల మహేశ్, పరుశురాం, సాయినాథ్, రవి కాంత్, దొండిబా, నవ్వ రాజు, అబూద్ పాల్గొన్నారు.

సిరిచెల్మలో గ్రామసభ

ఇచ్చోడ, ఫిబ్రవరి 15 : మండలంలోని సిరిచెల్మ పంచాయతీ కార్యాలయంలో గురువారం సిరిచెల్మ, బాజీగూడ, కేశవపట్నం ప్రత్యేకాధికారి రామారావ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. అనంతరం మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ అజీమ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూల్యాంకనం పరిశీలన

ఇచ్చోడ, ఫిబ్రవరి 15 : మండలకేంద్రంలోని ప్రగతి, ఎస్ఆర్, మైనార్టీ వెల్ఫేర్, మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో గురువారం పదో తరగతి మూల్యాంకనాన్ని టీమ్ సునిల్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ-1 నుంచి ఎఫ్ఏ-4, ఎస్సే-1 నుంచి ఎస్సే-2 సంబంధిత విషయ నిపుణులు మార్కులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు ముగ శ్రీనివాస్, పొన్నం పండరి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : సైన్స్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో గురువారం ఛాత్ర ఉపాధ్యాయులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సైన్స్ ప్రదర్శనలు చేపట్టారు. ప్రజలు మూఢనమ్మకాలు నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్ పాల్గొన్నారు.

సమావేశాలు వాయిదా

జైనథ్, ఫిబ్రవరి 15 : జైనథ్, తాంసి మండలాల సర్వసభ్య సమావేశాలు ఈ నెల 16న నిర్వహించాల్సి ఉండగా, అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో పెట్టుకొని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవోలు రవీంద్రనాథ్ మోహన్ రెడ్డి గురువారం వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని తెలిపారు.

ఎన్నికల వరకు కోర్ కమిటీ బాధ్యత

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : కొలాం సేవా సంఘం జిల్లా కమిటీ రద్దు చేసి 3 నెలల అవుతున్నదని, తదుపరి ఎన్నికలు జరిగే వరకు కోర్ కమిటీ పూర్తి బాధ్యతలు స్వీకరించిందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావు పేర్కొన్నారు. త్వరలోనే కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

అధ్యక్షుడి ఎన్నిక

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : భారతీయ బౌద్ధమ సభ జిల్లా అధ్యక్షుడిగా విఠల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌గడపాలే తెలిపారు. జిల్లా కేంద్రంలోని అశోక్ బుద్ధవిహార్‌లో గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు కాంతారావు, భారత్ గైక్వాడ్, అన్నారావు టిక్టే, కుష్వర్తలాండే, అమ్రపాలా, బేబీ కానిందే, లలితా, దయానంద్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
ముంబయి: 91827 77676, ఆంధ్రప్రదేశ్: 91827 77679
నిజామాబాద్: 91827 77671, 91827 77677

హోంగార్డును అభినందించిన ఎస్పీ

హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : జాతీయ స్థాయిలో హై జంప్‌లో రజత పతకం, త్రిపుల్ జంప్‌లో కాంస్య పథకం సాధించిన హోంగార్డు శంకర్‌ను ఎస్పీ గౌస్ ఆలం అభినందించారు. ఈ మేరకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డు శంకర్‌కు పుష్పగుచ్ఛం అందించి, సత్కారించారు. బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2024లో జిల్లా నుంచి శంకర్ పాల్గొన్నాడని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపి రెండు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించేలా తన వంతు కృషి చేస్తానని, శిక్షణకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే అంతర్జాతీయస్థాయిలో మే నెలలో థాయిలాండ్‌లో నిర్వహించే పోటీలకు ఎంపికవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆర్ఐ సీఐ టీ మురళి ఉన్నారు.

కూరలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జైనథ్, ఫిబ్రవరి 15 : మండలంలోని కూర గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి పద్మావతి అలువేలు మంగమ్మ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ చేశారు. సుప్రభాతసేవ మహా హారతి, తీర్థప్రసాద గోష్ఠిని నిర్వహించారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, కుంభ ఆహ్వాన మండపారాధన అగ్ని ప్రతిష్ఠి, హోమం గరుడ సేవ నిర్వహించనున్నారు. శనివారం కల్యాణం కానివారికి, సంతానం లేనివారికి గరుడ ప్రసాద వితరణ కార్యక్రమం, ఆదివారం మధ్యాహ్నం 12:15 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మహాప్రసాదం వితరణ, రథోత్సవం ఊరేగింపు, భజన, జాతర కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ముస్తాబైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కమిషనర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖమర్ అహ్మద్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ అంబకంటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నహిద్, ప్రవీణ్‌కుమార్, షాకీర్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, సంజయ్, పందిరి భూమన్న, భారత్, సతీశ్, నర్సింగ్, రామ్‌కుమార్, స్వాగత్, భూమన్న, ఎన్ దయాకర్ పాల్గొన్నారు.

కార్మికుల సేవలు గొప్పవి

ఉట్నూర్, పిబ్రవరి 15 : పట్టణాన్ని నిత్యం శుభ్రంగా ఉంచేందుకు జీపీ కార్మికుల సేవలు గొప్పవని ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఈవో శంకర్ అన్నారు. జీపీ కార్యాలయంలో గురువారం సీనియర్ జీపీ కార్మికుడి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్వేష్, రామస్వామి, నరేశ్, మహ్మద్, జీపీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రాజమల్లు మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. కాగా, గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న హాజరై, రాజమల్లు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధికి రాజమల్లు చేసిన కృషిని గుర్తుచేకున్నారు. ఎన్నో ఏళ్లుగా తనతో ఉన్న అనుంబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. రాజమల్ల లేని లోటు తీర్చలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

16న సమ్మె, గ్రామీణ బంద్‌కు మద్దతు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి, కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతాంగం పొట్టగొడుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 16న జాతీయ కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయలంలో గురువారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మర్చి, వ్యవసాయ చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తెచ్చి, ఉపాధి హామీ పథకాన్ని ఎండబెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఇలా దేశ ప్రజల అవసరాలను గాలికొదిలేసి ఊరేగుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేలా కార్మికవర్గం, ప్రజానీకం సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బండి దత్తాత్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా నాయకులు కుంటాల రాములు, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకట్ నారాయణ, మాస్‌లైన్ ప్రజా పంథా నాయకులు వినోద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దర్శనాల మల్లేశ్

మహిళా సాధికారతపై అవగాహన

జైనథ్, ఫిబ్రవరి 15 : మేడిగూడలో గురువారం మహిళా సాధికారత, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండర్ కో-ఆర్డినేటర్లు కోటేశ్వర్, కృష్ణవేణి మాట్లాడుతూ.. లింగ వివక్షత, లింగ సమానత్వం, భేటీ బచావో, భేటీ పడావో గురించి వివరించారు. సుకన్య, సమృద్ధి యోజన, ఆడ పిల్లలకు అందుతున్న పథకాలపై అక్షరాస్యత కో-ఆర్డినేటర్ నిఖిలేశ్వర్ సూచించారు. అంగన్‌వాడీ టీచర్ గంగాదేవి, వెంకటమ్మ, పద్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : ఆదిలాబాద్ డీఎస్పీగా ఎల్ జీవన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. హుజూరాబాద్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న జీవన్ రెడ్డి, ఇక్కడికి డీఎస్పీగా వస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన వీ ఉమే